బీసీ రిజర్వేషన్ల ఆమోదం కోసం సీఎం పోరాటం

● కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ.మురళీకృష్ణ

నల్లకుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఢిల్లీ వేదికగా ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు పోరాటం చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ.మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రతినిధుల బృందం ఢిల్లీలో పర్యటించనున్నదన్నారు. ఈ నెల 5న పార్లమెంట్ ఉభయ సభల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు అంశాన్ని కాంగ్రెస్ ఎంపీలు గళమెత్తనున్నారని అన్నారు. 6న జంతర్‌మంతర్ వద్ద ధర్నా, 7న రాష్ట్రపతిని కలిసి ఈ అంశంపై వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుపై తమ స్పష్టమైన ప్రకటన చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఉద్యమ పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

హనుమాన్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


హనుమాన్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులకు సత్కారం

నల్లకుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ గోల్నాక కూరగాయల మార్కెట్‌లోని హనుమాన్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం హనుమాన్ ఆలయం ప్రాంగణంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హనుమాన్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా నంగునూరు శ్రీనివాస్‌గుప్తా, ప్రధానకార్యదర్శిగా కంతటి పృథ్వీరాజ్, కోశాధికారిగా బెండే లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగనుంది.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తైక్వాండో గ్రాండ్ మాస్టర్ జయంత్‌రెడ్డి తదితరులు

31న కేఎల్‌బీ 2 ఓపెన్ తెలంగాణ రాష్ట్ర తైక్వాండో పోటీలు

ముషీరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో సీనియర్ కోచ్‌లు కేపీ.హనుమంతు, విజయ్‌సింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్‌లో గల డీఎస్ఆర్ గార్డెన్స్ లో కేఎల్‌బీ2 ఓపెన్ తెలంగాణ రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్లు తైక్వాండో గ్రాండ్ మాస్టర్ జయంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తైక్వాండో తెలంగాణ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయంత్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం క్రీడాకారులను ప్రోత్సహిస్తూ రాష్ట్రస్థాయిలో తైక్వాండో పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో సీనియర్ కోచ్ కేపీ.హనుమంతు, గజేందర్, నాగరాజు, అర్జున్, అబ్దుల్, లోకేష్, నరేష్, నరేందర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే వారికే పదవులు: మంత్రి పొన్నం


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ముషీరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికే అధిష్ఠానం పదవులు ఇస్తుందని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భోలక్‌పూర్‌కు చెందిన టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ మోహినొద్దీన్ ఇంటికి మంత్రి వెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులను కలిసి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకోసం నిరంతరం పాటుపడే వ్యక్తులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బిలాల్, హాజీమ్, జావిద్, డాక్టర్ బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న బస్తీ నేతలు

నల్లకుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో పత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యంతో ఆదివారం ఆలయంలో అమ్మవారికి బోనం సర్పించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రత్నానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.బి.కిషోర్‌కుమార్, ఉపాధ్యక్షుడు రాముయాదవ్, ప్రధాన కార్యదర్శి పింజరి నర్సింగ్‌రావు, సంయుక్త కార్యదర్శి వీరయ్యగౌడ్, కోశాధికారి పి.వెంకటేష్, నళినికాంత్, బి.సతీష్, లింగం, వెంకట్, నందు, బస్తీవాసులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో 29 బంగారు పతకాలు


పతకాలు సాధించిన జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు

బర్కత్‌పుర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో 29 బంగారు పతకాలను జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు సాధించారని అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి తెలిపారు. బెంగళూరులో జరిగిన 13వ షోటోకాన్ జాతీయ కరాటే పోటీల్లో రాష్ట్రం నుంచి జీవీఆర్ కరాటే అకాడమి విద్యార్థులు 18 మంది పాల్గొని, ఈ పతకాలు సాధించారని తెలిపారు. కటా విభాగంలో 14 బంగారు, 3 రజత పతకాలు, కుమితి విభాగంలో 15 బంగారు, 3 రజత పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారని తెలిపారు.

రైలులో ప్రయాణికురాలి బంగారు నగలు, నగదు చోరీ

బర్కత్‌పుర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని కడపకు చెందిన పద్మజ(43) కాచిగూడకు రావడానికి చర్లపల్లి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. రైలు మహబూబ్‌నగర్ వద్ద ఉండగా హ్యాండ్ బ్యాగు సీటుపై పెట్టి బాత్రూమ్‌కు వెళ్లింది. తిరిగొచ్చినసరికి హ్యాండ్ బ్యాగు దొంగలు తస్కరించారు. ఈ బ్యాగులో 20 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక సెల్‌ఫోన్, రూ.10వేల నగదు ఉన్నాయి. ఆదివారం పద్మజ కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని పెయింటర్ మృతి

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని పెయింటర్ మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఓల్డ్ మలక్‌పేటలో నివాసం ఉంటున్న మహ్మద్ సిరాజ్(29) పెయింటర్. శనివారం అర్ధరాత్రి మలక్‌పేట - డబీల్‌పుర రైల్వే స్టేషనల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మహ్మద్ సిరాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా శ్రావణ మాసం బోనాలు

● భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు
● అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్


నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్ తదితరులు


రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేసిన ఆలయ కమిటీ ప్రతినిధులు పలు రాజకీయ పార్టీల నేతలు

నల్లకుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకుని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు జరిగాయి. యంగ్‌మెన్స్, లోకల్ లారీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఉదయం జరిగిన వేడుకల్లో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, తొలి బోనం నైవేద్యంగా సమర్పించారు. అనంతరం పరిసర ప్రాంతాల మహిళలు అమ్మవారికి బోనం సమర్పించి, మొక్కులను తీర్చుకున్నారు. ఈ ఉత్సవంలో మాజీమంత్రి సి.కృష్ణయాదవ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నల్లకుంట డివిజన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భువనగిరి సురేష్‌యాదవ్, బి.ధన్‌రాజ్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో ఆలయానికి తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కుతాడి రవికుమార్, ఉపాధ్యక్షుడు ఎం.బాస్కర్‌యాదవ్, ఆలయ కమిటీ ప్రతినిధులు కేఎం.రాజు, ఎం.నాగరాజుగౌడ్, సత్యనారాయణ యాదవ్, నాయకులు ఎం.మధుయాదవ్, వెంకటేష్‌గౌడ్, సైదులు, సాయి, అభివర్ధన్, మహేందర్‌యాదవ్, హర్షవర్ధన్, పాతకోటి మహేష్, రాఘవేంద్రగౌడ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సంగీతంతో మానసిక ప్రశాంతత


గాయని దేవీనాయుడును సన్మానిస్తున్న త్రినాథరావు తదితరులు

చిక్కడపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సంగీతం మనస్సును ఎప్పుడూ ఉల్లాసంగా ఉంచుతుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్‌బీఐ మాజీ ఏజీఎం డా.త్రినాథరావు అన్నారు. స్వరాలాపన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 40 మంది గాయనీగాయకులతో నవ్వవే నా చెలీ శీర్షికతో నిర్వహించిన 12 గంటల నిర్విరామ సినీ సంగీత విభావరికి త్రినాథరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్థ నిర్వాహకురాలు, గాయని దేవీనాయుడును సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, రాజశేఖర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల చైతన్యంతోనే రాజ్యాధికారం సాధ్యం


బీసీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిక్కడపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బీసీల ఐక్యత, చైతన్యంతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీ సంక్షేమసంఘం అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సాయంత్రం అరుంధతినగర్ బస్తీలో బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో బస్తీ ప్రధాన కూడలి వద్ద సమితి నాయకులు కైరంకొండ నర్సింగ్‌గంగపుత్ర అధ్యక్షతన బీసీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు యాదగిరి, నాగుల ప్రకాష్, బాబా, సాయి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

ఎరుకల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

రాంనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎరుకల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని రాష్ట్ర గిరిజన సహకార ఆర్థికాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్ పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎరుకల హక్కుల పోరాట సమితి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమపథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అట్టడుగు వర్గాలకు న్యాయం చేయాలంటే యువత చట్టసభల్లో రాణించాలన్నారు. హక్కులు సాధించుకోవడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఐక్యంగా ఉండాలని అన్నారు. ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు వలిగి ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 కోట్లతో ఏకలవ్య కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు శ్రీనివాసులు, పోచయ్య, సమ్మయ్య, నరహరిప్రసాద్, ఉపేందర్, విజయ్‌కుమార్‌గౌడ్, భాగ్య, దుర్గారావు, వెంకటేశ్వర్లు, కిషన్, నరసింహ, రమణ, బలరాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో కఠిన చర్యలు : ట్రాఫిక్ సీఐ

కవాడిగూడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించేలా రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్ చేసినా, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ పి.వెంకటలక్ష్మి హెచ్చరించారు. గాంధీనగర్ ట్రాఫిక్ పోలీస్ పరిధిలోని అక్రమ పార్కింగ్, ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వివిధ వాహనదారులు, వ్యాపారులపై చర్యలు తీసుకున్నామన్నారు. ముషీరాబాద్ చౌరస్తా నుంచి సీజీవో టవర్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా అనేక రోజులుగా పార్కింగ్ చేసిన వాహనదారులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పెంటాగౌడ్, కార్తీక్‌గౌడ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆసక్తిని కోల్పోవద్దు : వక్తలు


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

రాంనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తగా లేదా ఒక బాధ్యతాయుత వ్యక్తిగా ఎదగాలంటే విద్యార్థులు మీలోని ఆసక్తిని, అర్థం తెలుసుకోవాలనే తపనను ఎప్పటికీ కోల్పోవద్దని పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యార్థులు ఏ మార్గంలో ప్రయాణిస్తున్నా అది పరిశోధన, బోధన, పరిశ్రమలో పని కావచ్చు లేదా ఇతర రంగాల్లో కొత్త అవకాశాల అన్వేషణ గుర్తించి నేర్చుకోవడమనేది ఎప్పటికీ ఆగదన్నారు. ప్రతి దశలో కూడా మార్పులను స్వీకరించాలని, ప్రశ్నలు అడగడం ద్వారా మీరు నిజమైన విజ్ఞానాన్ని పొందగలుగుతారని వారన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆటోనోమస్ కళాశాల పీజీ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సరోజ వివేక్, కార్యదర్శి, మాజీమంత్రి, ఎమ్మెల్యే గడ్డం వినోద్, జాయింట్ సెక్రటరీ పీవీ.రమణకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ మట్టా, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూయేషన్ ప్రొఫెసర్ డి.యాదగిరి, డైరెక్టర్ విష్ణుప్రియ, డాక్టర్ ఎన్.వెంకటేష్, టి.అశోక్‌గౌడ్, రూపా తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విజ్ఞానం, నైపుణ్యం, విలువలతో జీవితం సాగించాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు.

మత్స్యకారుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం


కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి ఏఐఎఫ్ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జాతీయ మహాసభలకు బయలుదేరిన సంఘం నేతలు

రాంనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోని మత్స్యకారుల సమస్యలపై వారి హక్కుల కోసం నిరంతరం ఆందోళన పోరాటాలు నిర్వహిస్తుండగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత్స్యకారుల హక్కులను కాలరాస్తుందని అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య సంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ ఆరోపించారు. మత్స్యకారులకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను ఎత్తివేస్తుందని, అందులో భాగంగానే ఎన్‌సీడీసీ, ఎన్ఎఫ్‌డీబీ స్కీమ్‌లను రద్దు చేసిందని విమర్శించారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్‌డబ్ల్యూఎఫ్) జాతీయ మహాసభలు ఈ నెల 6, 7వ తేదీలలో తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలకు తెలంగాణ రాష్ట్రం నుంచి 20 మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నరసింహ, ఉపాధ్యక్షుడు చనమెని శంకర్, సహాయ కార్యదర్శులు గొడుగు వెంకట్, మునిగల రమేష్, తేలు, ఇస్తారి, బక్కి బాలమని, అమరావతి తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి సేవాసమితి ఆధ్వర్యంలో గోల్నాక డివిజన్ వీరన్నగుట్ట శివాలయం నుంచి నెహ్రూనగర్‌లోని శివాలయం వరకు యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు భారీ తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి సేవాసమితి సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, బళ్ల గురుస్వామి, నాగరాజు స్వామి, శ్రీనివాస్‌స్వామి, గణేష్, గిరి, యువకులు, భక్తులు పాల్గొన్నారు.
- (గోల్నాక, ఆగస్టు 3 ఆంధ్రజ్యోతి)



గోల్నాక డివిజన్ తులసీరాంనగర్(లంక) బస్తీ కమిటీకి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా రాచకట్ల దేవేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభాకర్, బస్తీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడిగా పడకంటి అంజయ్యచారి, శాంకరిదేవి నల్లపోచమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా గట్ల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారమోని రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని బస్తీపెద్దలు అభినందించారు.
- (గోల్నాక, ఆగస్టు 3 ఆంధ్రజ్యోతి)

సిటీ సెంట్రల్ లైబ్రరీ, అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డులో పోలీసు బందోబస్తు

చిక్కడపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలతో చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీ, అశోక్‌నగర్ క్రాస్‌రోడ్, సర్కిల్ ప్రాంతాలు హోరెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం లైబ్రరీ, అశోక్‌నగర్‌లో పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. బీఆర్ఎస్ నేతలు నిరుద్యోగులకు మద్దతుగా నిలిచి లైబ్రరీ వద్ద లేదా అశోక్‌నగర్ క్రాస్‌రోడ్‌లో ఆందోళనకు దిగనున్నట్లు సమాచారం రావడంతో చిక్కడపల్లి పోలీసులు ఆ ప్రాంతాల్లో పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు. డీఐ శంకర్ పర్యవేక్షణలో ఎస్ఐలు, సిబ్బంది భారీసంఖ్యలో విధుల్లో ఉండి నిరుద్యోగుల రాకపోకలను నిశితంగా గమనించారు. అనుమానితులను గుచ్చిగుచ్చి ప్రశ్నించడంతోపాటు ఎక్కడైనా బీఆర్ఎస్ విద్యార్థినేతలు, నిరుద్యోగులు, పోటీపరీక్షల అభ్యర్థులు గుమిగూడారా అనే అనుమానంతో పరిసరప్రాంతాల్లో వెతికారు. అయితే మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎటువంటి ఆందోళన జరిగే అవకాశం కనిపించలేదు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ముందుజాగ్రత్త చర్యగా అయిదుగురు నిరుద్యోగనేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

బనకచర్లపై మాజీ మంత్రుల రాద్ధాంతం తగదు: టీడీపీ


బాల్‌రాజ్‌గౌడ్

చిక్కడపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బనకచర్లపై మాజీమంత్రులు, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావు రాద్ధాంతం చేయడం తగనిపని అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ప్రధానకార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని వినియోగించుకుంటుంటే అనవసరంగా ఏపీ ప్రభుత్వంపై, ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబుపై అవాకులు, చవాకులు పేల్చడం సబబు కాదని పేర్కొన్నారు.


పిచ్చిమొక్కలు పెరిగి వట్టిపోయి కనిపిస్తున్న మున్సిపల్ పార్క్ స్థలం

మున్సిపల్ పార్క్‌ను అభివృద్ధి చేయాలి

చిక్కడపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని గడ్డంసార్ స్కూల్ లేన్ నుంచి ఆకుల శ్రీను లేన్ వరకు ఇండ్ల మధ్య విస్తరించి ఉన్న మున్సిపల్ పార్క్‌ను అభివృద్ధి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఈ స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగి భయంకరంగా మారిందన్నారు. కోతులు, విషపురుగులు, శునకాలు చేరి పార్కు ప్రాంతంలో తిరుగుతున్నాయి. పార్కుగా మార్చి అభివృద్ధిచేస్తే స్థానికులకు సాయంత్రం వేళల్లో సేదతీరడానికి అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా ఓపెన్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ అభివృద్ధి పనులు ప్రారంభించాలి'

చిక్కడపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సికింద్రాబాద్ ఎంపీ కోటా నుంచి నిధులు మంజూరు చేయించేందుకు కార్పొరేటర్ కృషి చేస్తున్నారని, నిధులు మంజూరై పనులు కూడా త్వరలోనే ప్రారంభం అవుతాయని కమ్యూనిటీహాల్ పరిరక్షణ కమిటీ చైర్మన్ ప్రకటించి నెలరోజులు దాటుతున్నా పనులు ప్రారంభం కాలేదన్నారు. కమ్యూనిటీహాల్ లోపలి భాగంలో కరెంట్‌వైర్లు వేలాడుతున్నాయని చెప్పారు. కమ్యూనిటీహాల్ ఆవరణలో ఉన్న వంట గది పక్కన ఇండ్లలో నుంచి చెత్తను సేకరించే సైకిల్ రిక్షాలు పార్కింగ్ చేస్తున్నారని, దీంతో అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోందన్నారు. ఇప్పటికైనా నిధులు త్వరగా మంజూరు చేయించి పనులు ప్రారంభించాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరుతున్నారు.


జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో అభివాదం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

చిక్కడపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల డిక్లరేషన్‌ను, ఎస్సీలకు ప్రకటించిన 18 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ మన్నె దయానంద్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ మాలసంఘాల జేఏసీ నూతన కమిటీ సమావేశంతోపాటు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ యాక్టు ఉపసంహరించుకోవాలన్నారు. లేనట్లయితే పంజాబ్ రైతుల స్ఫూర్తిగా పోరాటం చేస్తామన్నారు. జీవో నెంబర్ 99ని సవరించాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో మాలలకు అన్యాయం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపులో భాగస్వామ్యులైన మాలలకు అన్యాయం చేయడం తగదన్నారు. అనంతరం జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మన్నె దయానంద్, కో- చైర్మన్‌లుగా కేశవులు, గడ్డం సత్యనారాయణ, అనంతరామ్, వైస్‌చైర్మన్‌లుగా నర్మెట్ట మల్లేష్, కొల్లూరి లక్ష్మణ్, భువనగిరి మంగ, అద్దంకి ఆనంద్‌తోపాటు ఇతర విభాగాల చైర్మన్లను ఎన్నుకున్నారు. అనంతరాములు, సత్యనారాయణ, పద్మారావు, నరేష్, శంకర్, నరసింహ, మారుతి తదితరులు పాల్గొన్నారు.

● నల్లపోచమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



గోల్నాక డివిజన్ నెహ్రూనగర్‌లోని నల్లపోచమ్మకు ఆదివారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన సతీమణి పద్మతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.
- (గోల్నాక, ఆగస్టు 3 ఆంధ్రజ్యోతి)

ఉప్పల్‌లోని ఓ ఇంట్లో డ్రగ్స్

(5వ పేజీ తరువాయి)

భరత్, రిషబ్‌షెట్టిలు నగరంలోని కస్టమర్స్‌కు రహస్యంగా విక్రయించి సొమ్ము చేసుకునేవారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుభాష్ చంద్ర, సిబ్బంది అఖిల్, వెంకటేశ్వర్లు సహా.. తన టీమ్‌తో కలిసి ఉప్పల్ పరిధిలో ఓ ఇంటిపై దాడి చేశారు. అక్కడ ఎండీఎంఏ డ్రగ్, గంజాయి కలిగి ఉన్న భరత్, రిషబ్‌షెట్టిలను అరెస్టు చేశారు. వారి నుంచి 13.65 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 513 గ్రాముల గంజాయి స్వాధీనం చేసున్నారు. నిందితులను మాదక ద్రవ్యాలను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

హార్స్ రేస్ బెట్టింగ్‌కు వాట్సాప్ గ్రూప్

(5వ పేజీ తరువాయి)

పోవడం, కుటుంబ కారణాలతో నగరానికి వచ్చాడు. మలక్‌పేటకు చెందిన రాజేష్‌కుమార్, విజయవాడకు చెందిన వెంకట్ చౌదరిలతో కలిసి హార్స్ రేస్ బెట్టింగ్‌లు నిర్వహించేవాడు. తర్వాత కాలంలో పంటర్లను ఆకర్షించి, సొంతంగా బెట్టింగ్ నిర్వహించాడు. అంతేకాక 'షైన్‌వెల్ ఎంటర్‌ప్రైజెస్' పేరుతో వాట్సాప్ గ్రూప్ రూపొందించి, అందులో బెట్టింగ్‌లు స్వీకరించేవాడు. ఈ గ్రూపులో దేశవ్యాప్తంగా 105 మంది పంటర్లు సభ్యులుగా ఉండగా, అందులో నగరానికి చెందిన వారు 20 మంది వరకు ఉన్నారు. వాట్సాప్ ద్వారా బెట్టింగ్‌లు తీసుకొని, ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహించేవాడు. ఈ దందాపై పక్కా సమాచారమందుకున్న మల్కాజిగిరి ఎస్ఓటీ, జవహర్‌నగర్ పోలీసులు కలిసి దాడి చేశారు. బుకీ నాగేష్‌తోపాటు, పంటర్లు మణికొండకు చెందిన బొర్రా వెంకట్ చౌదరి, కృష్ణానగర్‌కు చెందిన చల్లా రమేష్‌బాబు, సఫిల్‌గూడకు చెందిన సునీల్‌ను అరెస్ట్ చేశారు. నగేష్ బ్యాంకు ఖాతా నుంచి రూ.8.34 లక్షల మేర లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. బ్యాంకు ఖాతాలో ఉన్న 2.47 లక్షలను సీజ్ చేశారు. తదుపరి విచారణ కోసం నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న సొత్తును జవహర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.